క్లుప్తంగా

వైభవంగా మత్స్యనారాయణ స్వామి జయంతి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మొగల్తూరు: పేరుపాలెం కనకదుర్గమ్మ బీచ్‌లో ఉన్న మత్స్యనారాయణస్వామి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి విఖానస స్తోత్ర పారాయణ, స్వస్తి వచనం, విష్వక్షేన పూజా, కలసారాధనలు,పుణ్యాహవచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 108 సార్లు మత్య గాయత్రీ మంత్రాన్ని పఠించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో క్షయ నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యానారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం డిజిటల్ స్క్రీన్‌పై క్షయ వ్యాధి లక్షణాలు వాటి నివారణా చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోత్స్న, డాక్టర్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

అసెంబ్లీలో తీర్మానంపై హర్షం



చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: దళిత క్రైస్తవులను షెడ్యూలు కులాలుగా గుర్తించాలని అసెంబ్లీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్మానం చేయడంపై రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. శనివారం దెందులూరు వస్తున్న సీఎంకి ప్రత్యేక అభినందనలు తెలియజేయనున్నట్లు చెప్పారు. రంగనాథ్, పున్నయ్య కమిషన్లు కూడా దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చవచ్చని సిఫార్సు చేసినా వాటిని అమలు చేయలేదన్నారు.

భగత్‌సింగ్ ఆశయ స్ఫూర్తితో పని చేయాలి



అంబేడ్కర్ సెంటర్‌లో విప్లవవీరుల వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ లాంటి విప్లవ వీరుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు సూచించారు. శుక్రవారం అంబేడ్కర్ సెంటర్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఒకేసారి ఉరితీయబడ్డ ముగ్గురు విప్లవవీరుల వర్ధంతి కార్యక్రమాన్ని వారంరోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నాడ రాము, నోముల కొడ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది గుమాస్తాల సంఘం అధ్యక్షుడిగా పెద్దిరాజు



న్యాయవాది గుమాస్తాల సంఘం నూతన కార్యవర్గం

నరసాపురం: నరసాపురం న్యాయ న్యాయవాది గుమాస్తాలసంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం సంఘం భవనంలో లోకం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా కడలి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా చింతా నిరీక్షణరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కురెళ్ల పాండురంగారావు, సహాయ కార్యదర్శిగా కోటిపల్లి వీర వెంకటసత్యనారాయణ, కోశాధికారిగా కామన వెంకటేశ్వరరావు తదితరులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కామన బుజ్జి, యర్రంశెట్టి ఫణికర్ తదితరులు అభినందించారు.

రాగిజావతో సంపూర్ణ ఆరోగ్యం

- పాఠశాలల్లో గోరుముద్ద పథకంలో భాగంగా అందజేత
- విద్యార్థుల సమగ్ర ఎదుగుదలకు దోహదం



యలమంచిలి హైస్కూల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ రావూరి వెంకటరమణ (ఫైల్)

యలమంచిలి: జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో బెల్లపు రాగిజావను చేర్చడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. రాగి జావ, బెల్లంలో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండడం వల్లవిద్యార్థుల్లో చురుకుదనం పెరగడమే కాకుండా ఎముకుల పుష్టి వస్తుంది. తద్వారా బాగా చదవడమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట మెనూ పూర్తిగా మార్చి విద్యార్థుల సమగ్ర ఎదుగుదలకు అవసరమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు మరొక ముందడుగు వేసి వారంలో మూడు రోజులు అనగా మంగళవారం, గురువారం, శనివారం విద్యార్థులందరికీ బెల్లంతో చేసిన రాగి జావ అందించనున్నారు.

నియోజకవర్గంలో ఇలా

పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గ పరిధిలోని నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, ఆచంట, పెనుగొండ, పెనుమంత్ర మండలాల్లో 634 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 47,335 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో ప్రతి రోజు సగటున 40256 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరవుతుండగా సుమారుగా 35,609 మంది జగనన్న గోరుముద్ద స్వీకరిస్తున్నారు. ఈ విధంగా మొదటి రోజున సుమారు 36 వేల మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు.

జగనన్న గోరుముద్ద మెనూ ఇలా

సోమవారం	వెజ్ పలావు, కూర, గుడ్డు, చిక్కీ
మంగళవారం	రాగిజావ, పులిహోర, టమోట లేదా దొండకాయ పచ్చడి, గుడ్డు
బుధవారం	వెజ్ పలావు, బంగాళదుంప కూర, గుడ్డు, చిక్కీ
గురువారం	రాగిజావ, సాంబారు అన్నం, గుడ్డు
శుక్రవారం	పప్పు, ఆకు కూర, అన్నం, గుడ్డు, చిక్కీ
శనివారం	రాగిజావ, ఆకు కూరతో తయారుచేసిన అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	రాగిజావ తాగుతున్న విద్యార్థులు
నరసాపురం	122	9919	7601
పాలకొల్లు	97	8575	5806
ఆచంట	68	4603	3367
మొగల్తూరు	83	5661	4478
యలమంచిలి	82	5444	4517
పోడూరు	72	4992	4074
పెనుగొండ	61	4345	3073
పెనుమంత్ర	49	3796	2671

విద్యార్థులు ఇష్టపడేలా..



సాధారణంగా రాగిజావలో పెరుగు కలుపుకుని తాగుతారు. అయితే ఆ విధంగా చేస్తే పెరుగు కొంచెం పుల్లగా ఉండడం వల్ల విద్యార్థులు తాగేందుకు ఆసక్తి చూపరు. అందుకే పెరుగు బదులు బెల్లం కలిపి ఇవ్వడం వల్ల రాగిజావ తియ్యగా ఉండి విద్యార్థులు తాగేందుకు ఇష్టపడతారు. ప్రభుత్వమే నాణ్యమైన బెల్లం, రాగి పిండి పంపిణీ చేస్తుంది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అంది వారి సమగ్ర ఎదుగుదలకు సహకరిస్తుంది.

– మహ్మద్ లియాఖత్ అలీ, హెచ్ఎం

గోరుముద్దలో పోషకాలు పుష్కలం



జగనన్న గోరుముద్ద పథకంలో ఇస్తున్న ఆహారంలో ఐరన్, కాల్షియం, పొటాషియం అధికంగా ఉండి, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. ఇవి పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఎదిగేందుకు సహాయపడతాయి. మేము పాఠశాల సందర్శనకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సమయంలో 30 శాతం మంది విద్యార్థులు పోషకాహార లోపంతో, రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించాం. జగనన్న గోరుముద్దతో ఆ సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

– డాక్టర్ ఎం.సువిద్య, యలమంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి

ఈనిక సమయంలో పిచికారీ వద్దు



మట్లపాలెంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి: వరి పైరు ఈనిక దశలో ఉన్న సమయంలో ఎటువంటి పురుగుమందులు, తెగుళ్ల మందులు పిచికారి చేయవద్దని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చింతల శ్రీనివాసరావు కోరారు. మట్లపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్ పొలం బడి కార్యక్రమంలో ఆయన ఆధ్వర్యంలో ఏలూరు నుంచి వ్యవసాయ అధికారులు వచ్చి రైతులకు వరిసాగులో మెళకువలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మరొక జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు జి.రామలింగేశ్వరరావు మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితిలో పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తే ఉదయం సమయంలో అసలు చేయవద్దు అన్నారు. ఆ సమయంలో వరి కంకులు (ఫలదీకరణ) పాలు పోసుకుంటూ ఉంటాయన్నారు. కాబట్టి మధ్యాహ్నం ఒంటి గంట తరువాత పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం పొలంలోనికి వెళ్లి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయాధికారి కె కాశీమాత నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, గ్రామ వ్యవసాయ సహాయకులు కల్యాణ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కొడమంచిలి అభివృద్ధికి ప్రణాళిక



కొడమంచిలి పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: కొడమంచిలి గ్రామాభివృద్ధికి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో ప్రణాళిక రూపొందించడంతో పాటు, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. శుక్రవారం కొడమంచిలి పంచాయతీలో పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీపీ చెరువులో సీసీ రోడ్డు నిర్మాణం, చినపేటలో అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మంచినీటి చెరువును బాగు చేసేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. మట్టి మోరంలో భాగంగా పుంత రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు, అరుంధతీ పేట తీర్థాల పుంతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు, కామాక్షీ దేవాలయం పక్కన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో కార్యదర్శి షేక్ హీనాభాను, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, సభ్యులు చిలుకూరి శ్రీనివాస్, బొంతా సుబ్బారావు, కుసుమే నారాయణ మూర్తి, బొక్కా మల్లేశ్వరరావు, బొక్కా రామలక్ష్మీ, కటారి ఏసమ్మ, సల్లపూడి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఐక్యతతో పోరాడాలి

పెనుగొండ: దళితులు అందరూ ఐక్యత కలిగి ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలని మాలమహానాడు (రాజేష్ కమిటీ) జిల్లా ఉపాధ్యక్షుడు సరేళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నడిపూడి పెదపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి మాల మహానాడు నూతన కమిటీ నియామకం చేపట్టి ధ్రువీకరణ పత్రాలు అందించారు. గ్రామ నూతన అధ్యక్షుడుగా పినిపే జ్యోతిబాబు, యూత్ ఉపాధ్యక్షుడుగా మానుకొండ వెంకట్, నియోజకవర్గ కార్యదర్శిగా మేడిద మోహన్‌ను నియమించారు. కార్యక్రమం పులిదిండి వెంకటేశ్వరరావు, రొక్కాల విజయగాంధీ, అరిగెల పుల్లారావు, కుసుమే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

పెనుగొండ: జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో భాగంగా పెనుగొండ మండలంలో 25 నుంచి 31 వరకూ పశువులకు టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రమీలా రాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాడి రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఆర్‌జెడ్ భూముల్లో ఆక్రమిత స్థలాల పరిశీలన



పేరుపాలెంలో సీఆర్‌జెడ్ భూములు పరిశీలిస్తున్న కాలుష్య నియంత్రణ అధికారులు

మొగల్తూరు: సీఆర్‌జెడ్ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించుకున్న స్థలాలను శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశీలించారు. ఉమ్మడి జిల్లాల కాలుష్య నియంత్రణ మండలికి చెందిన ఈఈ కేవీ రావు, ఏఈఈ రమేష్‌లు తీరంలోని సీఆర్‌జెడ్ భూముల్లో అనుమతి లేకుండా నిర్మించుకున్న అక్రమ కట్టడాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2011 సీఆర్‌జెడ్ చట్టానికి వ్యతిరేకంగా నిర్మించుకోవడంతో గతేడాది రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలు తొలగించిన విషయాన్ని తహసీల్దార్ అనిత కుమారీ అధికారులకు వివరించారు. అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తే తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీరి వెంట ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, వీఆర్వో కావ్య తదితరులున్నారు.

ఉత్సాహంగా అన్నసమారాధన

మొగల్తూరు: స్థానిక పీతానివారివీధిలో ఉన్న పుంతలో ముసలమ్మ, కేపీ పాలెం నార్త్‌లోని కడలివారి మెరకలో ఉన్న గంగాలమ్మ వార్ల జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయ ఆవరణల వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవార్ల ప్రసాదాన్ని స్వీకరించారు.

హౌసింగ్ డీఈగా వెంకటేశ్వరరావు



నరసాపురం రూరల్: నరసాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈగా పి.వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన భీమడోలు, ఏలూరులలో ఏఈగా పనిచేశారు. కొంత కాలంగా ఏలూరులో డీఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా వెంకటేశ్వరరావు నరసాపురం డీఈగా బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను ఏఈలు, కార్యాలయ సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు.

పాడిరైతులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ జేసురత్నం

పోడూరు: పుట్టిన అరగంటలోనే లేగదూడకు జున్ను పాలు తాగించాలని డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ జేసురత్నం పాడిరైతులకు పిలుపునిచ్చారు. మట్టపర్రు గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన, దూడల పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామానికి చెందిన 25 మంది రైతులు హాజరై లేగ దూడలను ప్రదర్శించారు. అవగాహన సదస్సులో డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జేసురత్నం మాట్లాడుతూ లేగదూడలకు 6 నెలలు వయస్సు వచ్చేవరకు ప్రతీనెలా నట్టల నివారణ మందులు తాగించాలన్నారు. ప్రదర్శనలో లేగదూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం డీడీ డాక్టర్ నరసింహారావు, పోడూరు ఏడీ డాక్టర్ పి.జయకర్ జాన్సన్, మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్ మహేష్‌కుమార్, డాక్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాల విడుదల

యలమంచిలి: యలమంచిలి మండల స్థాయి 26వ యూటీఎఫ్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను శుక్రవారం సంఘ నాయకులు పోలిశెట్టి క్రాంతికుమార్, ఈద దైవ వరప్రసాద్, పంతం రామ్మూర్తినాయుడులు విడుదల చేశారు. ఐదవ తరగతి తెలుగులో కొంబత్తుల ధనుశ్రీ కావ్య (అబ్బిరాజుపాలెం) ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానంలో పోలిశెట్టి వెంకట విజయ శ్రీగోపాల్ (కట్టుపాలెం) సైన్స్‌లో పెమ్మాడి జ్ఞాన తేజశ్రీ (లక్ష్మీపాలెం) ప్రథమ స్థానం సాధించారు. 10వ తరగతి తెలుగు మాధ్యమం తెలుగులో చీర్ల గంగా దీపిక (దొడ్డిపట్ల హైస్కూల్) హిందీలో డీలు లహరిక (మేడపాడు), ఇంగ్లీష్‌లో బొర్రా యజ్ఞవిష్ణు దుర్గా మహేష్ (మట్లపాలెం), గణితంలో దొంగ భారతి (శిరగాలపల్లి) ఫిజికల్ సైన్స్‌లో చింతపల్లి అమృత (మేడపాడు), బయలాజికల్ సైన్స్‌లో జి అశ్విని (దొడ్డిపట్ల) సోషల్ స్టడీస్‌లో బొలిశెట్టి మురళీకృష్ణ (ఏనుగువానిలంక) విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం గణితంలో కె చిన్ని కృష్ణ (చించినాడ), ఫిజికల్ సైన్స్‌లో చెల్లుబోయిన శ్రీనాథ్ (మట్లపాలెం) బయలాజికల్ సైన్స్‌లో బొర్రా యజ్ఞవిష్ణు దుర్గా మహేష్ (మట్లపాలెం), సోషల్ స్టడీస్‌లో పోతుల నాగ (ఏనుగువానిలంక) విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు వారు వివరించారు. మరింత మంది విద్యార్థులకు ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

ఫెర్రీ వేలం పాట వాయిదా



పాట నిర్వహణలో పాల్గొన్న అధికారులు, జేఏసీ సభ్యులు

నరసాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ ఆధీనంలోగల మాధవాయిపాలెం ఫెర్రీ వేలంపాట 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన వేలాన్ని వాయిదా వేశారు. టెండర్ షెడ్యూళ్లను కొనుగోలు చేసిన 4గురు పాటదారులు పాటకు హాజరయ్యారు. సీల్డ్ కం బహిరంగ పద్ధతిలో జరిగే ఈ పాటకు సర్వం సిద్ధం చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ఈ పాట వ్యవహారం గంటన్నర గడచినప్పటికీ పాటదారుల్లో చలనం లేకపోవడంతో ఎంపీడీఓ జేఏసీ సభ్యులతో చర్చించారు. సమయం మించిపోతున్నందున సీల్డ్ టెండర్లు దాఖలు చేయాలని ఎంపీడీఓ పదేపదే కోరినప్పటికీ పాటదారుల్లో స్పందన రాలేదు. అనంతరం కొంత సమయం తరువాత టెండరు షెడ్యూల్ కొనుగోలు చేసిన నలుగురిలో ఒక్కరు మాత్రమే సీల్డ్ పద్ధతిలో టెండరు షెడ్యూల్‌ను దాఖలు చేశారు. పాటలో పాల్గొని టెండరు దక్కించుకునేందుకు పాటదారులు ఆసక్తి కనబర్చకపోవడంతో ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్‌యాదవ్ జేఏసీ సభ్యులతో చర్చించి ఫెర్రీ వేలాన్ని వాయిదా వేశారు. జరిగిన వ్యవహారాన్ని అంతా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే తిరిగి రేవుపాటను ఏప్రిల్ 6న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపుం సఖినేటిపలి ఎంపీడీవోలు శివప్రసాద్‌యాదవ్, జి.భీమారావు, ఎంపీపీలు మైలాబత్తుల సోనీ, మల్లిఖార్జునరావు, జెడ్పీటీసీ సభ్యురాలు డి.అన్నపూర్ణ, జేఏసీ సభ్యులు దొంగ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటవుతుందని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కర్రి జోగయ్య అన్నారు. పాలకొల్లు మండలం లంకలకోడేరు పెదపేట నెం.2 అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం పోషకాహార పక్షోత్సవంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి మాట్లాడుతూ ఆకుకూరలు ఎక్కువగా భుజించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పిల్లి శ్రీనివాస్, సహోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు ఝాన్సీ, విజయ, పార్వతి, సౌజన్య, పద్మ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

ఆకివీడు: బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని ఎంపీపీ కఠారి జయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. చిన్న పిల్లలకు వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మండల పరిషత్ సమావేశాలకు మండల స్థాయి అధికారులు పలువురు గైర్హాజరవడాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి మళ్లీ తీసుకెళతామన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి చెరువుల్ని పూర్తి స్థాయిలో నింపుకునేందుకు కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు, జల జీవన్‌మిషన్ పనులు త్వరితగతిని ప్రారంభించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పార్వతి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి గ్రామానికీ రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నిధులు వచ్చాయని, పైప్‌లైన్ల విస్తరణ, రక్షిత నీటి పథకాలు, సంప్‌లు, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణం వంటి పనులు చేయిస్తామని చెప్పారు. ప్రజలకు ఉచితంగా పైప్ కనెక్షన్లు ఇచ్చేందుకు కూడా మెటీరియల్ అందుబాటులో ఉందన్నారు. ఎఫ్‌డీఓ వివేక్ మాట్లాడుతూ సుమారు 460 ఎకరాల చెరువుల్ని ఆక్వా జోన్‌లోకి మార్పించేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు సహకరించాలని సీడీపీఓ కార్యలయ సూపర్‌వైజర్ రత్నకుమారి కోరారు. సచివాలయ భవన నిర్మాణాల్ని త్వరితగతిని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ జేఈ రమణమ్మ అన్నారు. ప్రతి గ్రామంలో రెండు మూడు, పట్టణ కేంద్రంలో 10కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయని లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు ఎంపీటీసీలకు తెలియజేయడంలేదని వైస్ఎంపీపీ సైదాల సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు కూడా చెప్పడంలేదన్నారు. విద్యుత్ సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని చెరుకుమిల్లి సర్పంచ్ నందమూరి ప్రకాశం ఆరోపించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజ్ కిషోర్, ఎంఈఓ రవీంద్ర, సర్పంచ్‌లు గురువెల్లి అన్నపూర్ణ, ప్రసాదరాజు, కోట అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురులో మానసా దేవి గుడి వరకు ఉన్న మార్గాన్ని సీసీ రోడ్డుగా సుమారు నాలుగు లక్షలు మండల పరిషత్ నిధులతో నిర్మిస్తున్నారు. ఈ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భారతి, వైస్ఎంపీపీ అడ్డాల శ్రీరామ్ చంద్రమూర్తి, గుబ్బల సత్యానారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సాధిక్, మల్లుల నర్సమ్మ, చింతపల్లి పండు, దుర్గాప్రసాద్, వార్డు సభ్యులు గుడి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.